సాక్షి
చిత్తూరు

బుధవారం। 3। జనవరి। 2024



ఒంటరి ఏనుగు బీభత్సం

గంగవరం మండలం కేసీపెంట గ్రామంలోని పొలంలో నివాసం ఉంటున్న ఓ రైతు ఇంటిపై ఏనుగు దాడి చేసి నష్టం కలిగించింది. - 8లో



రుణాలు మంజూరు చేయండి

వ్యవసాయ రంగాలకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - 8లో



స్కూళ్లలో మౌలిక వసతులపై సమీక్ష

ప్రభుత్వ స్కూళ్లలో పోలింగ్ కేంద్రాలుగా కేటాయించిన వాటిలో మౌలిక వసతులను పరిశీలించాలని డీఈఓ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

కుస్తీ జాతీయ పోటీల్లో కాంస్య పతకాలు



జాతీయ పతకాలతో విశాల్, యువకిషోర్

పుత్తూరు: విశాఖపట్నంలో గత నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి బీచ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ (కుస్తీ పట్టు) పోటీల్లో వడమాలపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు రెండు కాంస్య పతకాలు వచ్చినట్లు హెచ్ఎం కరుణానవనీతం తెలిపారు. 52 కిలోల విభాగంలో యువకిషోర్, 57 కిలోల విభాగంలో విశాల్ జాతీయ స్థాయిలో పతకాలు సాధించినట్లు వెల్లడించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను హెచ్ఎం, పీడీ చంద్రశేఖర్‌రాజు, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం పాఠశాలకు గర్వ కారణమని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ప్రారంభం

చిత్తూరు రూరల్: జిల్లాలో మంగళవారం జగన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం ప్రారంభమైంది. 19 మంది పీహెచ్‌సీ డాక్టర్లు, 38 మంది స్పెషలిస్ట్ డాక్టర్లతో హెల్త్ క్యాంపు నిర్వహించారు. మొత్తం 4,806 ఓపీలు వచ్చాయి. జనరల్ మెడిషన్ 1950, చిన్నపిల్లల సమస్యలు 188, ఆర్థో 810, డెంటల్ 96, చర్మం 166, కంటి సమస్యలు 800, ఇతర సమస్యలు 796 దాకా ఓపీలు వచ్చాయి. రోగులకు డాక్టర్లు మెరుగైన చికిత్స అందించారు. శిబిరాల వద్ద ఇబ్బంది లేకుండా మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ తనిఖీ



రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని చిత్తూరు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు యాదమరి మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమంలో వలంటీర్లు దగ్గర ఉండి లబ్ధిదారులకు రేషన్ అందించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. దీంతో వలంటీర్లు లబ్ధిదారులకు 50 ఇళ్లకు గానూ ఏడు ప్రదేశాలలో రేషన్ సరుకులు దగ్గర ఉండి అందించే కార్యక్రమం పక్కాగా అమలవుతోందా ? లేదా ? అని ఆయన మంగళవారం సాయంత్రం మండలంలోని దళవాయిపల్లె, గొల్లపల్లె, యాదమరిలో తనిఖీ చేశారు. వలంటీర్ల ఆధ్వర్యంలో రేషన్ సరుకులు సరఫరా చేస్తుండడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతి నెలా రేషన్ సరుకులు అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని గ్రామాల్లో సర్వర్ రాక ఇబ్బందులు పడుతున్నట్లు జేసీకి ఎండీయూ ఆపరేటర్లు చెప్పారు. దీనిపై ఆయన స్పందిస్తూ సర్వర్ ఉన్న ప్రదేశంలోనే లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, ఆర్ఐ ప్రసాద్, వీఆర్‌ఓ రేఖ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,358 మంది స్వామివారిని దర్శించుకోగా 19,534 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

5న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మూడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని సుమారు 120 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్న ట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తిచేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇందులో మూగ అభ్యర్థులు సైతం పాల్గొనవచ్చునని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంభనకు కృషి చేస్తోంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు వైఎస్సార్ ఆసరా, స్త్రీనిధి ఉన్నతి పథకం ద్వారా అతివలు సమాజంలో ఉన్నతంగా బతుకుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన డ్వాక్రా రుణమాఫీతో పాటు వారి ఆర్థిక చేయూతకు బంగారు బాటలు వేయడంతో గత నాలుగున్నరేళ్లలో లక్షలాది కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధించి మహిళా సాధికారత స్వప్నం నిజం చేశారు.

డ్వాక్రా మహిళల రుణమాఫీకి సంబంధించిన మెగా చెక్కును అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి (ఫైల్)



వైఎస్సార్ ఆసరా.. అతివకు భరోసా



- మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ ప్రభుత్వ తోడ్పాటు
- వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రా సంఘాల సభ్యులకు భరోసా
- మహిళా ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్ సర్కార్ పాలన
- జిల్లాలో 310330 మంది లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.1297.16 కోట్ల లబ్ధి

కార్వేటినగరం: గత నాలుగున్నరేళ్ల కిందట రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళల తలరాతలు మారిపోయాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమలుతో పాటు అతివల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు గడువుతో సంబంధం లేకుండా ఎవరు ఎప్పుడైనా పథకాల లబ్ధి పొందేలా చర్యలు తీసుకున్నారు. అందులో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలకు ఆర్థిక పరిపుష్టిని కల్పించారు. పొదుపు సంఘాల మహిళలకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చే డబ్బును లబ్ధిదారుల అంగీకారం లేకుండా, సంఘం లేదా సంబంధిత మహిళల వ్యక్తిగత అప్పులకు జమ చేసుకోవడానికి వీల్లేదని బ్యాంకర్లకు స్పష్టం చేశారు. ఆ డబ్బును మహిళలు ఏ అవసరాలకైనా వినియోగించుకోవచ్చని, వీటిపై ఎలాంటి ఆంక్షలు ఉండవని కూడా స్పష్టం చేశారు. రుణాల మంజూరులో కూడా ఎక్కడా ఇబ్బంది కలగకుండా బ్యాంకర్లు సహకరిస్తుండడం గమనార్హం.

సిద్ధించిన మహిళా సాధికారత..

వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళా సాధికారిత మరింత మెరుగుపడింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల ఆర్థిక పురోగతికి మార్గాలు సుగమమయ్యాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలను రుణ విముక్తులను చేసేందుకు వైఎస్సార్ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళల స్వయం సహాయక సంఘాల్లోని అప్పుల నిల్వను నాలుగు విడతల్లో చెల్లించే బృహత్తర కార్యక్రమాన్ని నిర్విరామంగా అమలు చేసి మహిళల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

బాబు హయాంలో దగా ..

డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఆ తరువాత హామీని నిలబెట్టుకోకుండా మహిళలకు మొండి చేయి చూపాడు. ఆ హామీని నమ్మి బ్యాంకులకు రుణాలు చెల్లించని మహిళలు డిఫాల్టర్లుగా మారారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం వచ్చాక మహిళ సంఘాలు మళ్లీ ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. ఇప్పటికే మూడు విడతల్లో రుణమాఫీ సొమ్మును మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు. దీంతో 99.8 శాతం మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడ్డాయి.

మాట ప్రకారం మాఫీ..



ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగనన్న మూడు విడతల్లో డ్వాక్రా రుణాలను మాఫీ చేశారు. కంతుల వారీగా వేసిన మొత్తాన్ని వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టి రోజుకు రూ.600 చొప్పున ఆదాయం సంపాదిస్తున్నా. నాలుగో విడత రుణమాఫీ కింద వచ్చే మొత్తాన్ని కూడా వ్యాపారానికి వాడుకుంటా. మేము ఎప్పటికీ జగనన్న వెంటే ఉంటాం. – శాంతి, పాదిరికుప్పం, కార్వేటినగరం మండలం

పాడి ఆవులతో జీవనం



రుణమాఫీతో పాటు, సంఘం పొదుపులో రూ.50 వేలు తీసుకుని ఆవు కొనుగోలు చేశా. నాలుగో విడతలో వచ్చే రుణమాఫీ నగదుతో ఆవుతో పాటు పొట్టేళ్లు కొని చేసి ఆదాయం పొందుతున్నా. – దేవి, విడిదిపల్లి, పెనుమూరు మండలం

పొట్టేళ్ల వ్యాపారం చేస్తున్నా



3 విడతల రుణమాఫీతోపాటు ఎస్‌హెచ్‌జీలో స్త్రీనిధి కింద రూ.50 వేలు తీసుకుని పొట్టేళ్లు కొనుగోలు చేశాను. మా కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన సీఎం జగనన్నను ఎన్నటికీ మరువం. – నిర్మల, విడిదిపల్లి, పెనుమూరు

సంఘాల సంఖ్య	సభ్యుల సంఖ్య	మొదటి విడత	రెండవ విడత	మూడవ విడత	నాలుగో విడత
33620	310330	1297.16	325.01	324.28	324.28

మహిళల సంక్షేమానికి పెద్దపీట..



మా సంఘం తరపున బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1.30 లక్షల రుణం తీసుకున్నాం. ఇప్పటి వరకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రెండు విడతలుగా రూ.24 వేలు లబ్ధి పొందాను. ఈ డబ్బుతో స్త్రీనిధి కింద కొంచెం డబ్బులు తీసుకుని పాడిపశువు కొన్నా. ఇప్పుడు నెలకు రూ.10 వేలు ఆదాయం వస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సీఎం జగన్ మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు.

– అంబిక, సింహరాజపురం, పాలసముద్రం మండలం

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం ..



మా పొదుపు తరపున బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1.50 లక్షల రుణం తీసుకుని ఉన్నతి కింద రూ.50 వేలు తీసుకుని ఆటో కొన్నాను. ఆటో తోలితే నెలకు రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వస్తుంది. వైఎస్సార్ సున్నావడ్డీ వర్తించడంతో పాటే వైఎస్సార్ ఆసరా పథకంలో రెండు దఫాలుగా లబ్ధి చేకూరింది. ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– సుమతి, కేజే పురం, పాలసముద్రం మండలం

ఆసరా తోడ్పాటునిచ్చింది..



బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1.50 లక్షల రుణం తీసుకుని, మా ఊర్లోనే చికెన్ దుకాణం నడుపుతున్నాను. కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం వస్తోంది. వైఎస్సా ర్ ఆసరా పథకం ద్వారా రెండ విడత ల్లో రూ.32 వేలు లబ్ధి చేకూరింది. మా కుటుంబం సీఎం జగనన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటుంది. – భ్యూలా, తిరుమలరాజపురం, పాలసముద్రం

25న పోలింగ్ సరళిపై మాక్‌పోల్

- ఓటు హక్కుపై స్కూల్, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించండి
- జిల్లాలో మార్చి ఒకటో తేదీ వరకు ఓటర్లను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాల నిర్వహణ
- వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ షణ్మోహన్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పోలింగ్ సరళిపై అవగాహన ముఖ్యమని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఎన్నికల కసరత్తుపై ఆయన వరుస సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సరళిపై పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 25న మాక్‌పోల్ అవగాహన కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి పోలింగ్ స్టేషన్ వారీగా ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల భాగస్వామ్యం (స్వీప్ యాక్టివిటీస్) చేస్తూ సంబంధిత బీఎల్‌ఓలు ఓటు హక్కు నమోదు, ఓటర్లు తమ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో మృతి చెందిన ఓటర్ల పేర్లను తొలగించే విషయంలో సంబంధిత పంచాయతీ సెక్రటరీలతో సమన్వయం చేసుకుని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆశా, స్వయం సహాయక సంఘాల మహిళలు కార్యక్రమంలో భాగస్వామ్యులై జిల్లా వ్యాప్తంగా అక్షరాస్యత తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 25న జిల్లావ్యాప్తంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు మాక్‌పోల్ నిర్వహించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఈఓ విజయేంద్రరావు, డీవీఈఓ సయ్యద్‌మౌలాను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో కళాశాలల వారీగా ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేసి, యువ ఓటర్ల నమోదు, ఓటు హక్కు వినియోగం పట్ల అవగాహన పెంచాలని ఆదేశించారు. ఓటర్ల భాగస్వామ్యం కార్యక్రమాలు (స్వీప్ యాక్టివిటీస్) పట్ల డ్వామా, ఐసీడీఎస్, డీఈఓ, జెడ్పీ సీఈఓ, మున్సిపల్ శాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి..

జిల్లాలో త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడంతో పాటు మౌలిక వసతుల ఏర్పాటు, పీఓ, ఏపీఓ, మైక్రో అబ్జర్వర్ల నియామక ప్రక్రియకు సంబంధించి పలు శాఖల అధికారులతో కలెక్టర్ షణ్మోహన్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 1,762 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఫర్నీచర్, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతుల వివరాల నివేదికను ఈ నెల 5వ తేదీలోపు సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు పీఓ, ఏపీఓ, మైక్రో అబ్జర్వర్, సెక్టోరియల్ అధికారుల నియామకానికి, సంబంధిత శాఖల్లో సిబ్బంది వివరాలను త్వరితగతిన పంపాలన్నారు. సమావేశాల్లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవానీ, డీఈఓ విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఆర్డీఓలు చిన్నయ, మనోజ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సుజన, ఐటీసీఎల్ డిప్యూటీ కలెక్టర్ గంగాభవానీ, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష క్యాంపు తనిఖీ..

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం గుడిపాలలో జరిగిన జగనన్న ఆరోగ్యసురక్ష–2 క్యాంపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే అత్యధికంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవల కోసం ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచడం జరిగిందని, తద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యువ సైన్యం



భూమన అభినయ్‌రెడ్డి



చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

- వైఎస్సార్‌సీపీ తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల సమన్వయకర్తల నియామకం
- భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఖరారు

సాక్షి, తిరుపతి: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్తల రెండో జాబితాలో భాగంగా తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గ సారథులను నియమించారు. కేంద్ర పార్టీ కార్యాలయం విడుదల చేసిన అసెంబ్లీ సమన్వయకర్తల జాబితాలో యువకులైన ప్రస్తుత తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి (చంద్రగిరి), తిరుపతి నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి (తిరుపతి)కి చోటు కల్పించారు. వీరి నియామకంతో తిరుపతి, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. వీరిద్దరూ ఇప్పటికే నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. తండ్రికి తగ్గ తనయులుగా శభాష్ అనిపించుకుంటున్నారు. తమ నియోజకవర్గాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

అభినయ్‌రెడ్డి ప్రొఫైల్

పేరు: భూమన అభినయ్‌రెడ్డి వయస్సు: 36
విద్యార్హత: ఎంఎస్(లండన్), బీటెక్(హైదరాబాద్)
తండ్రి: భూమన కరుణాకరరెడ్డి (తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్)
తల్లి: రేవతి
భార్య: మోనీషా
పిల్లలు: ఇద్దరు (ఒక అబ్బాయి, ఒక అమ్మాయి)
పదవులు: తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్

మోహిత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం

- సింగపూర్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లండన్‌లోని వార్విక్ యూనివర్సిటీ నుంచి డిస్టింక్షన్‌లో మాస్టర్స్ డిగ్రీ పట్టాను పొంది ఉన్నత విద్యనభ్యసించారు.
- 18 ఏళ్లకే ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులై ఆరేళ్ల బాధ్యతలు నెరవేర్చారు.
- 22 ఏళ్లకు తిరుపతి రూరల్ మండలం, పెరుమాళ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొందారు.
- 1లక్ష 33 వేల ఓటర్లు కలిగి, 39 మంది ఎంపీటీసీ సభ్యులు, 40 మంది సర్పంచ్‌లు ఉన్న రాష్ట్రంలోనే అతిపెద్ద మండలమైన తిరుపతి రూరల్ మండల ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- అతి చిన్న వయసులో తుడా చైర్మన్‌గా, టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమితులయ్యారు.
- వైఎస్సార్‌సీపీలో కీలకమైన యువజన విభాగం రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

చిత్తూరు జెడ్పీ పాలనపై సీఎం ప్రశంసలు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



కేక్ కట్ చేస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తోందని జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జెడ్పీలోని ఆయన చాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గడిచిన రెండేళ్లలో నాలుగుసార్లు కేంద్రబృందం జిల్లాలో పర్యటించిందన్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, హౌసింగ్, అంగన్‌వాడీ ఇలా ఇక్కడ అమలవుతున్న పథకాలు, అభివృద్ధి బాగుందని బృందసభ్యులు చెప్పడం గొప్ప విషయమన్నారు. ఇటీవల రాష్ట్రంలోని జెడ్పీ పాలనపై చిత్తూరు పాలన బాగుందని మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో సీఎం జగనన్న కితాబు ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. జిల్లాపరిషత్ చైర్మన్ అయినప్పటి నుంచి పారదర్శక పాలన అందించడానికి సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, సంబంధిత జిల్లాశాఖాల అధికారుల సమన్వయమే కారణమన్నారు. అదేవిధంగా కలెక్టర్ అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. పలువురు ఎంపీడీఓల పదోన్నతి కల నెరవేరింది, కారుణ్య నియామకాలు సకాలంలో చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకం లబ్ధిదారులకు అందాలనే పాలన సాగుతోందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తొలుత నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చైర్మన్ చేత కేక్ కట్ చేయించారు. అలాగే డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డిని మంగళవారం జెడ్పీ చైర్మన్, సీఈఓ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు డీఆర్‌డీఏ పీడీ తులసి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ చంద్రశేఖర్, పీఐయూ ఈఈ రమణయ్య, ఎంపీటీసీ యశోద ఇతర అధికారులు ఉన్నారు.

నేటి నుంచి సౌత్ జోన్ పోటీలు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్‌జోన్ అండర్ –14 విభాగం క్రికెట్ పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారు.

క్లుప్తంగా

పెట్రోల్ బంకుల్లో ముసుగు దొంగ చేతివాటం



క్యాష్ కౌంటర్‌లో నగదు కాజేస్తున్న ముసుగుదొంగ

శ్రీరంగరాజపురం : ఓ ముసుగు దొంగ పెట్రోల్ బంకులో అర్ధరాత్రి చోరీకి పాల్పడి నగదు కాజేసిన సంఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని ముసుగుదొంగ ఇండియన్ పెట్రోల్ బంక్‌లో చోరీకి పాల్పడ్డాయి. బంకులోని సిబ్బంది గదిలో నిద్రిస్తుండగా తలుపును లాక్ చేసి కౌంటర్లో ఉన్న రూ.2.40 లక్షల నగదును దొంగలించాడు. అయితే దొంగ చోరీ చేస్తున్న విషయం సీసీ కెమెరాలో రికార్డు అయింది. అనంతరం లక్ష్మీపురం గ్రామం వద్ద ఉన్న నయార పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి చోరీ చేసే క్రమంలో తలుపును పగుల గొట్టడానికి విశ్వప్రయత్నం చేశాడు. అయితే ఎంతసేపటికీ తలుపు రాకపోవడంతో వెనుదిరిగాడు. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ యజమాని గోపి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షెక్షావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు అవ్వండి

- కలెక్టర్ షణ్మోహన్‌కు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, ప్రజాప్రతినిధులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధిలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పలు శాఖల జిల్లా అధికారులు మంగళవారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు ఈ నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పలు శాఖల జిల్లా అధికారులు విజయేంద్రరావు, రాజ్యలక్ష్మి, పద్మనాభం, గంగాభవానీ, ఏఓ కులశేఖర్, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు అమర్‌నాథ్, హుస్సేన్, రెవెన్యూ సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విరివిగా రుణాలు మంజూరు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : వ్యవసాయరంగాలకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు లబ్ధిదారులను గుర్తించేందుకు బ్యాంకర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను ఆలస్యం చేయకూడదన్నారు. జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి చేయూత ఇవ్వాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు బ్యాంకర్లు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణను మరింతంగా అమలు చేయాలని తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నిబంధనల ప్రకారం రుణాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆర్‌బీఐ ప్రతినిధి నాగప్రవీణ్, నాబార్డ్ డీడీఎం సునీల్, ఇండియన్ బ్యాంక్ జెడ్ఎం రాజేష్, జిల్లా అధికారులు తులసి, ప్రభాకర్, లక్ష్మీ, మధుసూదన్‌రెడ్డి, మురళీకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి

చిల్లకూరు: లారీ డ్రైవర్లుగా పనిచేసేందుకు వచ్చిన ఇద్దరు యువకులు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన చిల్లకూరు మండలం, చింతవరం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని చింతవరం గ్రామానికి చెందిన పూడిపర్తి మల్లారెడ్డికి ఉన్న టిప్పర్లలో డ్రైవర్లుగా పనిచేసేందుకు కొంతకాలం క్రితం ఝార్ఖండ్ రాష్ట్రం, హజీరాబాగ్ జిల్లా పడిర్మా గ్రామానికి చెందిన బీరేంద్రకుమార్(21), కోడిరామ్ జిల్లా, గుంబో బారావాడి గ్రామానికి చెందిన మనీష్ చౌదరి (21) వచ్చారు. వీరు ఇతర ప్రాంతాలకు లారీలో లోడ్డు తీసుకుని వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో మల్లారెడ్డికి చెందిన కాటా వద్ద టిప్పర్‌ను నిలుపుకుని సహచర డ్రైవర్ ముఖేష్‌తో కలిసి ఇద్దరూ గ్రీస్ పట్టేందుకు పూనుకున్నారు. ఈ క్రమంలో పైన వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలను గమనించకుండా హైడ్రాలిక్ ఎత్తారు. వెంటనే విద్యుత్ తీగలకు టిప్పర్ బాడీ తగలడంతో గ్రీస్ పెడుతున్న బీరేంద్రకుమార్, అందులోనే ఉన్న మరో డ్రైవర్ ముఖేష్, మనీష్ చౌదరి షాక్‌కు గుర య్యారు. ముఖేష్ టిప్పర్‌లో నుంచి కిందకు దూకివేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. టిప్పర్‌లోనే ఉన్న మనీష్‌చౌదరి అక్కడికక్కడే మృతి చెందగా, బీరేంద్రకుమార్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతన్ని స్థానికులు చింతవరం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బీరేంద్రకుమార్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్‌ఐ అంజిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకుని జార్ఖండ్‌కు చెందిన మరికొంత మంది నుంచి వివరాలను సేకరించారు. అనంతరం కాటా యజమాని మల్లారెడ్డి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుల కుటుంబాలకు సమాచారం అందించారు. గతంలోనూ ఇదే స్థలంలో 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి టిప్పర్ డ్రైవర్ ఒకరు మృతి చెందినట్టు గుర్తుచేశారు.

విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- పెంచిన పింఛన్ల పంపిణీలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు అందించే పింఛన్లపై తొలి సంతకం చేసి విడతల వారీగా పెంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మంగళవారం ఆయన కార్వేటినగరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ లత ఆధ్వర్యంలో పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. ఎక్కడా లేనివిధంగా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి వేకువజామునే ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందిచండం గొప్ప విషయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలంటూ పేదలను లంచం కోసం వేధించాయని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం పగటి వేషగాళ్లు వస్తారని, వారి మాటలు విని మోసపోవద్దని సూచించారు. నిరంతరం సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనుంజయవర్మ, మండల కోప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, డీఆర్‌డీఏ పీడీ తులసి, జలకళ అడిషనల్ పీడీ ఉమావాణి, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలలో కూడా అనుకోలేదు



గతంలో నేను టీడీపీ అభిమాని. పింఛన్ కావాలని వెళ్లా. జన్మభూమి కమిటీ సిఫార్సు చేయాలన్నారు. అధికారులు పట్టించుకోలేదు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వలంటీర్ వచ్చి పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నమ్మలేక పోయా. దరఖాస్తులో సంతకం పెట్టా అంతే నెలకే పింఛన్ అందింది. నేను కలలో కూడా అనుకోలేదు. జగనన్నకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– అన్సర్, ముస్లిం కాలనీ, కార్వేటినగరం

ఆడుదాం.. ఆంధ్రా విజేతల దాతృత్వం



వ్యాధి గ్రస్తుడికి నగదు సాయం అందిస్తున్న ఆడుదాం.. ఆంధ్రా విజేతలు

పెద్దపంజాణి: ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో గెలుపొందిన విజేతలు తమకు వచ్చిన నగదు బహుమతిని లివర్ వ్యాధితో బాధ పడుతున్న వ్యక్తికి అందజేసి దాతృత్వం చాటుకున్నారు. వివరాలు.. మండల పరిధిలోని రాయలపేట, కమ్మపాళ్యం సచివాలయాల పరిధిలో ఇటీవల ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలు జరిగాయి. అందులో గెలుపొందిన విజేతలకు స్థానిక సర్పంచ్ అరుణ, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా సలహాదారు డా.చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ అంజమ్మ, ఎంపీటీసీ సరస్వతి గురునాథ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, రాయలపేట ఎంపీపీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు రూ.10 వేలు నగదు బహుమతిని ప్రదానం చేశారు. అయితే ఈ నగదును విజేత జట్టులోని సభ్యులు మంగళవారం లివర్ వ్యాధితో బాధపడుతున్న గంకొండ గ్రామానికి చెందిన జి. సురేష్‌కు వైద్య చికిత్సల కోసం అతని సమీప బంధువు భాస్కర్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో పీఎస్‌లు గణపతి, జఫ్రుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరుగా ఇద్దరు మృతి



ధనుంజయ (ఫైల్)



చెరువులో పడి మృతి చెందిన గోపి

బైరెడ్డిపల్లె: మండలంలోని దర్మపురి గ్రామానికి చెందిన వెంకటముని కుమారుడు ధనుంజయ (31) ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తూ అదుపుతప్పి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ధనుంజయ సోమవారం రాత్రి నెల్లిపట్ల గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. గ్రామ సమీపంలో అదుపుతప్పి రహదారి సమీపంలో ఉన్న గుంతల్లో బోల్తా పడ్డాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో, మంగళవారం ఉదయం రహదారిపై వెళ్లే బాటసారులు గమనించి కుటుంబ సభ్యులను సమాచారం అందించారు. మృతుడికి భార్య దుర్గ, ఆరు నెలల అబ్బాయి ఉన్నాడు. అలాగే మండలంలోని కడపనత్తం గ్రామానికి చెందిన నాగభూషణం కుమారుడు గోపి (24) మతిస్థిమితం లేకపోవడంతో కడపనత్తం పెద్ద చెరువులో దూకి చనిపోయాడు. పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

సచివాలయంలో చోరీకి యత్నం

నాగలాపురం: మండలంలోని కృష్ణాపురం సచివాలయంలో సోమవారం రాత్రి చోరీకి యత్నించినట్టు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ హుక్ తెలిపారు. సచివాలయానికి వెనుక వైపు ఉన్న ఇనుప తలుపునకు వేసి ఉన్న తాళాలను పగులకొట్టి కార్యాలయంలోకి ప్రవేశించారన్నారు. ఆతర్వాత బీరువాని పగులగొట్టి రికార్డులు చిందరవందర చేశారని చెప్పారు. మంగళవారం ఉదయం పంచాయతి కార్యదర్శి బీరువా తాళాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్కూళ్లలో మౌలిక వసతులపై సమీక్ష



మాట్లాడుతున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు మౌలిక వసతులను పరిశీలించాలని డీఈఓ విజయేంద్రరావు ఎంఈఓలను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈఓ–1, 2లు జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. ఎంఈఓల కార్యాలయాల్లో రిజిస్టర్లు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి అజయ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓలు రమేష్, త్యాగరాజులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పీఎఫ్ వివరాలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయుల భవిష్యనిధి ఖాతాల వివరాలను జెడ్పీ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్టీయూ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భవిష్యనిధి ఖాతా మొత్తాల వివరాలను అందుబాటులో ఉంచాలని నాయకులు విన్నవించారు. సాంకేతిక సమస్యతో సర్వర్ సక్రమంగా పనిచేయడం లేదని సీఈఓ తెలిపారు. జిల్లాలో భవిష్యనిధి ఖాతాల సమాచారాన్ని అందుబాటులో ఉంచామని, అవసరమైన వారు కార్యాలయంలో వివరాలు తెలసుకోవచ్చన్నారు. సకాలంలో కారుణ్య నియమాకాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా నాయకులు దేవరాజులరెడ్డి, మోహన్, మదన్‌మోహన్‌రెడ్డి, గుణశేఖర్, మురళీధర్, మధుబాబు, మోహన్, బాలాజీ, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు బీభత్సం

- పొలంలోనే నివాసం ఉంటున్న ఓ రైతు ఇంటిపై దాడి
- ఆస్తి, పంట నష్టం కలిగించిన గజరాజు
- లబోదిబోమంటున్న బాధిత రైతు రఘునాథ్



ఇంటి గోడలు, వస్తు సామాగ్రిని ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు

గంగవరం: గ్రామ సమీపంలోని పొలంలోనే ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న ఓ రైతు ఇంటిపై ఒంటరి ఏనుగు దాడి చేసి బీభత్సం సృష్టించింది. వివరాలు.. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కేసీ పెంట గ్రామ సమీపంలోని తన పొలంలో కట్టుకున్న ఇంటిలో రైతు రఘునాథ్ కుటుంబంతో కలిసి గత ఏడేళ్లుగా నివాసం ఉంటున్నాడు. ఇంటిలో అంతా నిద్రిస్తున్న సమయంలో మంగళవారం వేకువజామున అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు ముందుగా పాడి పశువులపై దాడి చేసింది. పశువుల అరుపులకు ఇంటిలో నిద్రిస్తున్న రఘునాథ్, కుటుంబ సభ్యులు లేచి చూశారు. ఏనుగు వచ్చినట్లు గుర్తించి భయంతో గ్రామంలోకి పరుగులు తీశారు. గొడ్లపాకను ఏనుగు నేలకూల్చగా, పాడి పశువు తీవ్ర గాయాలతో గడ్డివామి కింద ఇరుక్కుపోయింది. అనంతరం ఇంటి గోడలను, ఇంటిలోని వస్తు సామగ్రిని పూర్తిగా ధ్వంసం చేసింది. బాధిత రైతు రఘునాథ్ ఉదయాన్నే గ్రామస్తులను తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. ఒంటరి ఏనుగు దాడిలో ఇంటితో పాటు గడ్డివాము, పశువులపై దాడి, ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరాడు.